క్లుప్తంగా

యోగాతో మానసిక ఉల్లాసం



ఉంగుటూరులో యోగా మాసోత్సవాలు చేస్తున్న దృశ్యం

ఉంగుటూరు: యోగాతో మానసిక ఉల్లాసం సాధ్యపడుతుందని పలువురు వక్తలు తెలిపారు. ఉంగుటూరులో శుక్రవారం యోగా మాసోత్సవాలు నిర్వహించారు. గ్రామ పంచాయతీ హాల్‌లో యోగా ఇన్‌స్ట్రక్టర్ మంద జయలక్ష్మి యోగా అభ్యాసకులుకు యోగాసానాలు గురించి వివరించారు. అంగన్‌వాడి , ఆశా, పంచాయితీ ఉద్యోగులు పాల్గొని యోగాసనాలు వేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాజ్‌మనోజు, తహసీల్దార్ రవికుమార్, ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రి డాక్టరు జి.శంకర్ ప్రసాద్ , పంచాయతీ కార్యదర్శి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ



ఉపాధి కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేస్తున్న దృశ్యం

దెందులూరు: మారిన వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ప్రతిఒక్కరూ ఆహార ఆరోగ్య జాగ్రత్తలు వైద్యుల సూచనలు సలహాలు పాటించాలని పోతునూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ప్రవీణ్ కుమార్ అన్నారు. శుక్రవారం పోతునూరు పరిధిలోని పలు ఉపాధి శ్రామికులకు, ప్రజలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. పలు సూచనలు చేశారు. ఎంపీహెచ్ఓ హరి, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

దెందులూరు: ప్రజలందరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని, ఆరోగ్యం లేకపోతే జీవితంలో సాధించేది ఏమీ ఉండదని పోతునూరు పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్ కుమార్ అన్నారు. శుక్రవారం దోసపాడులో పలు వీధులలో డ్రైపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఫ్లెక్సీలు చేతపట్టుకుని వ్యక్తిగత సామూహిక పరిశుభ్రత తీసుకోవలసిన జాగ్రత్తలు అంటు వ్యాధులు పరిశుభ్రతపై నినాదాలు చేశారు. అనంతరం గ్రామంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, ఎంపీహెచ్ఈఓ హరి పాల్గొన్నారు.

మహిళను రక్షించిన శక్తి టీమ్



మహిళకు కౌన్సెలింగ్ ఇస్తున్న శక్తి టీమ్

ఏలూరు టౌన్: ఏలూరు నగరంలోని తంగెళ్ల మూడి ప్రాంతానికి చెందిన ఒక మహిళ కుటుంబ కలహాల నేపథ్యంలో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకునేందుకు ప్రయత్నించింది. కుటుంబ సభ్యులు నెంబర్ 112కు ఫోన్ చేయగా శక్తి టీమ్ పోలీస్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మహిళను రక్షించింది. ఏలూరు శక్తి టీం ఇన్‌చార్జి సీఐ ఎం సుబ్బారావు తెలిపిన వివరాల ప్రకారం.. ఏలూరు నగరంలోని తంగెళ్లమూడి ప్రాంతానికి చెందిన శిరీషకు వివాహమైంది. భర్త ఆన్ లైన్ ట్రేడింగ్ చేస్తుంటారు. ఈ క్రమంలో కుటుంబంలో కొద్ది రోజులుగా కలహాలు చోటుచేసుకుని ఆమె తీవ్ర మనస్థాపానికి గురైంది. శుక్రవారం సాయంత్రం ఎస్ఆర్ పేటలోని ఎస్ఆర్ఐ కళాశాల సమీపంలోని రైలు పట్టాల వద్దకు ఆత్మహత్యకు పాల్పడేందుకు వెళ్లింది. ఆమె కుటుంబ సభ్యులు 112కు సమాచారం ఇవ్వడంతో నిమిషాల్లోనే పోలీస్ శక్తి టీం ఆమె వద్దకు చేరుకుంది. ఆమెకు కౌన్సెలింగ్ నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. శక్తి టీం సభ్యులను ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివ కిషోర్ అభినందించారు.

మట్టి నమూనాల సేకరణ

దెందులూరు : ఏలూరు రూరల్ మండలంలో 82 మట్టి నమూనాలు సేకరించామని ఏలూరు రూరల్ మండలం వ్యవసాయ శాఖ అధికారిని ఎ.జీవన సంధ్య అన్నారు. శుక్రవారం పాలగూడెంతోపాటు ఇతర గ్రామాల్లో వ్యవసాయ శాఖ అసిస్టెంట్లు నమూనా సేకరణ కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. రైతులకు సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఏలూరు రూరల్ మండలానికి 500 మట్టి నమూనా సేకరించాల్సి ఉండగా, వర్షాలు కారణంగా 82 మట్టి నమూనాలే సేకరించామని జీవన సంధ్య తెలిపారు. త్వరగా లక్ష్యం పూర్తి చేసేందుకు రైతులు వ్యవసాయ సిబ్బందికి సహకరించాలని కోరారు.

గ్రంథాలయాలు.. విజ్ఞాన వీచికలు



చిన్నారులకు కథలు చెబుతున్న మానవత స్వచ్ఛంధ సేవా సంస్థ జిల్లా డైరెక్టర్ తుమ్మల ఉమామహేశ్వరరావు



ఖోఖో ఆడుతున్న చిన్నారులు

- సత్ఫలితాలిస్తున్న వేసవి శిక్షణ తరగతులు
- గత నెల 28వ తేదీ నుంచి జూన్ 2వ తేదీ వరకు శిక్షణ
- అనేక అంశాలపై శిక్షణ పొందుతున్న విద్యార్థులు

భీమడోలు: విద్యార్థుల్లో పుస్తక పఠనం నైపుణ్యాలను పెంచి నిష్ణాతుడైన పరిపూర్ణ విద్యార్థులుగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర పౌర గ్రంథాలయ శాఖ చేపట్టిన వేసవి విజ్ఞాన తరగతులు సత్ఫలితాలనిస్తున్నాయి. కరోనా తర్వాత ప్రతి విద్యార్థి ఆన్‌లైన్ తరగతులకు ఎక్కువ సమయాన్ని కేటాయించి పుస్తక పఠనానికి దూరమవుతున్న వేళ.. ప్రభుత్వం చిన్నారులు ఆడుతూ పాడుతూ నేర్చుకున్న అంశాలకు అధిక ప్రాధాన్యతనిస్తూ ఈ శిక్షణ తరగతులు రూపొందించి అందుకు తగ్గట్లుగా ప్రతి గ్రంథాలయంలోను ప్రతి రోజు మూడు గంటల నుంచి 4 గంటల పాటు శిక్షణ అందజేస్తున్నారు. జాతీయ స్థాయిలో 15 ఏళ్లలోపు చిన్నారుల్లో 10శాతం కూడా పుస్తక పఠనం చేయడం లేదని ఓ సర్వే నివేదిక చెబుతుంది. అభివృద్ధి చెందుతున్న దేశాల్లోని చిన్నారులకు తల్లిదండ్రులు, గురువులు నేర్పించే అతిముఖ్యమైన అలవాటు పుస్తక పఠనం. ఈ నేపథ్యంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని గ్రంథాలయాల్లో గత నెల 28వ తేదీ నుంచి జూన్ 6వ తేదీ వరకు 40 రోజుల పాటు వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులను చేపట్టారు. దీనితో విద్యార్థులు వాటిని సద్వినియోగం చేసుకుంటున్నారు. ప్రతి రోజు ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు నిర్వహిస్తున్న శిక్షణ తరగతులకు అధిక సంఖ్యలో విద్యార్థులు హాజరైన శిక్షణ కార్యక్రమాలను వినియోగించుకుంటున్నారు. ఉంగుటూరు నియోజకవర్గంలోని భీమడోలులో 3, ఉంగుటూరు, నిడమర్రు మండలాల్లో ఒకొక్కటి చొప్పున 2, గణపవరం మండలంలో గణపవరం, పిప్పర గ్రంథాలయాల్లో ఉత్సాహంగా ఉల్లాసంగా శిక్షణ తరగతులు జరుగుతున్నాయి. రోజుల పాటు వివిధ అంశాలపై ప్రతిభ చూపిన చిన్నారులకు బహుమతులను అందజేస్తున్నారు.

లెక్కలు బాగా అర్థమవుతున్నాయి



ఏలూరులోని ఓ ప్రైవేటు పాఠశాలలో చదువుకుంటున్నాను. వేసవి శిక్షణ తరగతుల్లో భాగస్వామిగా ఉండడం నా అదృష్టంగా భావిస్తాను. నేను నా తోటి విద్యార్థులు ఇంటి దగ్గర ఉండకుండా ఇక్కడికి వచ్చి లెక్కలు, ఆటల పోటీల్లో పాల్గొని నా విజ్ఞానాన్ని మరింత పెంచుకునేలా సెలవులను సద్వినియోగం చేసుకుంటున్నాను.

– తనుశ్రీ, 9వ తరగతి విద్యార్థిని, భీమడోలు

ప్రతి రోజూ లైబ్రరీకి వస్తుంటాను



ప్రతి రోజు గ్రంథాలయానికి వచ్చి నీతి కథల పుస్తకాలు చదివి పుస్తక సమీక్షలు రాస్తున్నాను. రోజు కథలు, జాతీయ నాయకులు జీవిత చరిత్రలు చదవడం, పత్రికలను చదివి వాటిలోని ప్రధానాంశాలు రాసుకుంటాను. దీని వల్ల క్విజ్ పోటీల్లో చురుగ్గా పాల్గొంటున్నాను. వేసవి విజ్ఞాన శిక్షణ తరగతుల్లో టీచర్లు ఉమామహేశ్వరరావు, మండే సుధాకర్‌లు చక్కని కథలు, నైతిక విలువలతో కూడిన విద్య పట్ల అవగాహన కల్పిస్తున్నారు.

– దాసరి జయశ్రీలక్ష్మి, 8వ తరగతి, భీమడోలు

క్లిష్టమైన పదాలు అలవోకగా పలిస్తున్నాం



గ్రంథాలయంలో ఎన్నో పిల్లలు చదువుకునే పుస్తకాలున్నాయి. వేసవి శిక్షణ తరగతుల్లో వాటిని చదువుకుంటున్నాను. వాటితో పాటు గ్రంథపాలకుడు అమర్‌నాథ్ ఆధ్వర్యంలో మాకు సామాజిక కార్యకర్త గేదెల ఈశ్వరమ్మచే మాకు శ్లోకాలు పలిస్తున్నారు. దీనితో క్లిష్టమైన పదాలు కూడా అలవోకగా నేర్చుకుంటున్నాను. చాలా ఉపయోగకరంగా ఉంటున్నాయి.

– బి.మాధవి, 7వ తరగతి,పూళ్ల

పార్టీ బలోపేతానికి కృషి

దెందులూరు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఆ పార్టీ దెందులూరు నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలుగా నియమితురాలైన మేధినరావుపాలెం మాజీ సర్పంచ్ అంగడాల సీతారావమ్మ చెప్పారు. శుక్రవారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ తనకు పదవి రావడానికి కారకులైన పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరిలకు కృతజ్ఞతలు తెలిపారు. వారి నమ్మకాన్ని నిలబెట్టుకునేలా పార్టీ అభివృద్ధి కోసం పనిచేస్తానని చెప్పారు.

25న శుద్ధికరణ మాత మహోత్సవం

దెందులూరు: దెందులూరు ఆర్‌సీఎం చర్చిలో ఈనెల 25న శుద్ధికరణ మాత మహోత్సవం జరుగుతుందని దెందులూరు ఆర్‌సీఎం చర్చి పారిస్ ప్రీస్ట్ ఫాదర్ గోడే అమ్మన్ రాజా అన్నారు. శుక్రవారం దెందులూరులో ఆయన మాట్లాడుతూ ఏలూరు పీఠం వికార్ జనరల్ డాక్టర్ ఫాదర్ పి బాల ముఖ్య అతిథిగా మహోత్సవానికి విచ్చేస్తున్నారన్నారు. దెందులూరు విచారణ పరిధిలో ఉన్న వివిధ గ్రామాలకు చెందిన భక్తులు మహోత్సవంలో పాల్గొన్నాలని ఆయన కోరారు.

ఏరియా ఆసుపత్రిని అభివృద్ధి చేయాలి

జంగారెడ్డిగూడెం: స్థానిక ఏరియా ఆసుపత్రి అభివృద్ధిలో అందరూ భాగస్వామ్యం కావాలని ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ కోరారు. శుక్రవారం స్థానిక ఏరియా ఆసుపత్రిలో నూతన కమిటీ ఏర్పడిన తర్వాత మొదటి హెచ్‌డీఎస్ అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ హోదాలో చింతలపూడి ఎమ్మెల్యే పాల్గొని, మాట్లాడారు. కార్యక్రమంలో ఆర్‌డీవో, తహసీల్దార్, అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

అద్దెల దరువు.. వసతులు కరువు





అద్దె భవనాల్లో అంగన్‌వాడీ కేంద్రాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

- నియోజవర్గంలో అంగన్‌వాడీలకు సొంత భవనాలు ఒనకూరేనా?
- ఇరుకు గదుల్లో సతమతమవుతున్న పిల్లలు

దెందులూరు: కిషోర్ బాలికలు, గర్భిణులు, బాలింతలకు మెరుగైన సేవలందించాలి పౌష్టికాహారం అందజేయాలని అంగన్‌వాడీ కేంద్రాలు ఏర్పాటు చేశారు. వీటిని నిర్వహణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏటా రూ.కోట్లు విచ్చేస్తున్నాయి. క్షేత్రస్థాయిలో భవనాల కొరత విధించడంతో పిల్లలు ఇబ్బందులు పడుతున్నారు. దెందులూరు నియోజకవర్గంలో సింహభాగం కేంద్రాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. ఈ భవనాలకు పట్టణాల్లో రూ. 6 వేలు, గ్రామాల్లో అయితే రూ. 2 వేలు చొప్పున ప్రభుత్వం అద్దె చెల్లిస్తోంది.

సదుపాయాలు లేక అవస్థలు

అద్దె భవనాల్లో వసతులు లేకపోయినా నెట్టుకు రావాల్సిన పరిస్థితి నెలకొంది. చాలా కేంద్రాల్లో గాలి, వెలుతురు ఉండటం లేదు. అనేక చోట్ల పాఠశాలల్లో అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటు చేశారు. కొన్నిచోట్ల తాగునీటి సౌకర్యం గగనమే. అంగన్‌వాడీ సహాయకులు బిందెలతో తీసుకు రావాల్సిన పరిస్థితి. కొందరు పిల్లలు ఇళ్ల నుంచే మంచినీటిని తెచ్చుకుంటున్నారు. ప్రతినెలా సరుకులకు వచ్చే కిషోర్ బాలికలు, బాలింతలు, గర్భిణులు ఇరుకు గదులతో సతమతమవుతున్నారు.

నియోజవర్గంలో అంగన్‌వాడీ కేంద్రాల వివరాలు

దెందులూరు మండలం	30
పెదవేగి మండలం	37
పెదపాడు మండలం	27
ఏలూరు మండలం	17

సొంత భవనాల నిర్మాణాల కోసం ఉన్నతాధికారులకు నివేదించామని విద్యా సంవత్సరం ప్రారంభమయ్యాక కొన్ని సామాజిక భవనాలను అంగన్‌వాడీలు కేటాయించే అవకాశం ఉందని సంబంధిత అధికారులు తెలిపారు.

ఉన్నత పాఠశాలలో ఆధునీకరణ పనులు

దెందులూరు: దెందులూరు గారపాటి హైమావతి దేవి ఉన్నత పాఠశాల కళాశాలలో ఆధునీకరణ పనులు ప్రారంభించామని పాఠశాల ప్రధానోపాధ్యాయులు మల్లికార్జునరావు అన్నారు. శుక్రవారం ఆయన పాఠశాలలో మాట్లాడుతూ ఉన్నత పాఠశాలను ఇటీవల కళాశాలగా పదోన్నతి పొందిన నేపథ్యంలో పెరిగిన విద్యార్థులు అదనపు తరగతి గదులు పూర్తి సౌకర్యవంతంగా ఉండేందుకు ఆధునీకరణ పనులు చేపట్టడం జరిగుతుందన్నారు. తమ పాఠశాల కళాశాలలో కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా నూరు శాతం ఫలితాలు రావడం ఉపాధ్యాయులందరి సమష్టి కృషి ప్రధాన కారణమన్నారు. నిర్మాణ పనులు పాఠశాల కళాశాలలో స్వచ్ఛభారత్ పనులను గ్రంథపాలకులు గొల్లపూడి వెంకటేశ్వరరావు ప్రతిరోజు ఉదయం 6 గంటల నుంచి ఆయన పని చేస్తూ పర్యవేక్షించడం అభినందనీయమన్నారు.



పాఠశాలలో ఆధునీకరణ పనులను పర్యవేక్షిస్తున్న గ్రంథ పాలకుడు గొల్లపూడి వెంకటేశ్వరరావు

ఆధ్యాత్మిక ప్రవచనాలతో అలరించిన సాయిరామ్

భీమడోలు: భక్తాగ్రేసరునిగా, మహాశక్తి సంపన్నమగు దైవంగా వాసికెక్కిన హనుమను శ్రద్ధా భక్తులతో సేవించిన వారికి సకల శుభాలు చేకూరతాయని ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త డాక్టర్ జటావల్లభుల సాయిరామ్ అన్నారు. పూళ్ల పడమర వీధి సుందర హనుమ ఆలయం వద్ద 68వ వార్షిక హనుమజ్జయంతి ఉత్సవాల్లో భాగంగా రెండో రోజైన శుక్రవారం రాత్రి సాయిరామ్ ఆధ్యాత్మిక ప్రవచాన్ని అందించారు. హనుమ లీలలు అంశంపై ప్రసంగించారు. పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఆధ్యాత్మిక ప్రవచనాలు తిలకించారు. తొలుత ఆలయంలో స్వామి వారికి నిత్య విశేష అర్చనలు, భజనలు, సాంస్కృతిక ప్రదర్శనలు చూపరులను ఆకట్టుకున్నాయి.



డాక్టర్ జటావల్లభుల సాయిరామ్

హోల్కర్ త్యాగాలు మరువలేనివి

భీమడోలు: భారతీయ వీరనారి, పవిత్రమూర్తి రాణి అహల్యబాయ్ హోల్కర్ దేశం కోసం త్యాగాలను శ్లాఘనీయమని బీజేపీ ఉంగుటూరు నియోజకవర్గ కన్వీనర్ శరణాల మాలతీరాణి అన్నారు. పోలసానిపల్లి గ్రామ పంచాయతీ వద్ద శుక్రవారం రాణి అహల్యబాయ్ హోల్కర్ త్రి శతాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి సర్పంచ్ షేక్ రహీమాబేగం అధ్యక్షతన వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన శరణాల మాలతీరాణి మాట్లాడుతూ హోల్కర్ సేవలు మరవలేనివన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యురాలు అనంతమ్మ, జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు అడపా శోభారాణి, జిల్లా ఉపాధ్యక్షురాలు మిద్దె రమాదేవి, మండల అధ్యక్షుడు పి.మూర్తి, మండల కార్యదర్శి పాకిరం సత్యనారాయణ, జిల్లా దళిత మోర్చా అధ్యక్షుడు మత్తే శ్రీనివాసశాస్త్రి, పెద్దలు శ్యామ్‌రాజు, మద్దు శ్రీను, రాజేష్ పాల్గొన్నారు.



పోలసానిపల్లి వద్ద హోల్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

విద్యార్థి దశ నుంచే లక్ష్యాలను నిర్ణయించుకోవాలి

భీమడోలు: కిశోరబాలికలు జీవిత లక్ష్య సాధనకు ప్రతి ఒక్కరూ కష్టించి చదువుకోవాలని జిల్లా ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ శారద అన్నారు. గుండుగొలనులో నిర్వహిస్తున్న కిశోరి వికాసం 2పై అంగన్‌వాడీ కేంద్రం కోడ్ నెం.173 వద్ద శుక్రవారం గ్రామస్థాయిలో యుక్త వయస్సు బాలికల కోసం ప్రత్యేక శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బాల్య వివాహాలు నిర్మూలన, బేటీ బచావో, బేటీ పడావో, గుడ్ టచ్ బ్యాడ్ టచ్ వంటి అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. జీవిత లక్ష్యాలను చిన్నారుల నుంచి ఆమె అడిగి తెలుసుకున్నారు. వారంతా కలెక్టర్, ఎస్పీ, డాక్టర్, ఇంజనీరు కావాలన్న లక్ష్యాలు కలిగి ఉన్నామని పీడీకి తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి భీమడోలు ఐసీడీఎస్ ఇంచార్జి పీవో ఎండీ షహనాజ్‌బేగం అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పీడీ శారద మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి లక్ష్యాలను నిర్దేశించి వాటిని సాధించే దిశగా కష్టపడి, ఇష్టపడి చదువుకోవాలన్నారు. లక్ష్యం వైపు సాగాలంటే తగిన విజ్ఞానాన్ని పొందాలన్నారు. మంచిగా చదువుకుని ఉన్నత స్థితికి చేరుకుని తల్లిదండ్రులు, గురువులు, సమాజానికి మంచిపేరు తీసుకుని రావాలన్నారు. బాల్య వివాహాలు జరిగినట్లు మీ దృష్టికి వస్తే సంబంధిత అధికారులకు తెలియజేయాలన్నారు. 18 ఏళ్ల లోపు వివాహాలు చేసుకుంటే చట్టరీత్యా నేరమన్నారు. తల్లిదండ్రులను చైతన్యపర్చాల్సిన బాధ్యత మీపై ఉందన్నారు. ప్రేమ పేరుతో అకతాయిల ఉచ్చులో పడి జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. అనంతరం గ్రామంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, సిబ్బంది, విద్యార్థులతో కలిసి ఆమె ర్యాలీ, ప్రదర్శన చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఎం.కవిత, మహిళా కానిస్టేబుల్ భారతి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఎఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.



గుండుగొలనులో బాలికలకు అవగాహన కల్పిస్తున్న జిల్లా ఐసీడీఎస్ పీడీ శారద

యోగాచరణ దిశగా ప్రోత్సహించాలి

ఏలూరు(మెట్రో) : రాష్ట్ర వ్యాప్తంగా కనీసం రెండు కోట్ల మందికి యోగాలో ప్రవేశం లక్ష్యంతో యోగాంధ్ర ప్రచార కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రారంభించిందని కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. ఏలూరు వట్లూరులోని టీటీడీసీలో, నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ప్రతిరోజూ యోగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించేందుకు కార్యాచరణ రూపొందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మనిషి జీవన నాణ్యతను పెంచేందుకు శ్రేయస్సుకు, యోగా గొప్ప మార్గమని తెలిపారు. ఇతివృత్తం, ఆధారిత యోగా సెషన్లతోపాటు వివిధ పర్యాటక ప్రాంతాల్లో కార్యక్రమాలు నిర్వహించనున్నామని చెప్పారు. ట్రైనర్లు, పౌరుల రిజిస్ట్రేషన్‌కు ఏర్పాట్లు చేస్తున్నామని, ఈ నెల రోజులపాటు యోగాసనాలు అభ్యాసంతోపాటు ఆసనాల ప్రదర్శన, సూర్య నమస్కారం, ప్రాణాయామ ప్రదర్శన నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వివిధ విభాగాల్లో పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించాలని అన్నారు.

విద్యతోనే సామాజిక అభివృద్ధి

ద్వారకాతిరుమల: వ్యక్తిగత సామాజిక అభివృద్ధికి విద్య ఎంతో ముఖ్యమని ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్ టి.మేరి అన్నారు. మండలంలోని తిరుమలంపాలెం-2 అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం కిశోరి వికాసం 2.0 సెషన్-7 కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బాలికలకు విద్య, కెరీర్ మార్గదర్శకాలు, నైపుణ్యాల ప్రాముఖ్యతను మేరి తెలియజేశారు. అంతే కాకుండా చదువుకోవడం వలన విలువలు పెరుగుతాయన్నారు. విద్యా వ్యవస్థ మధ్యలో బడి మానేసిన పిల్లలు ఓపెన్ స్కూల్స్ ద్వారా చదువుకోవచ్చన్నారు. అనంతరం సచివాలయ మహిళా కార్యదర్శి ఎస్కే అఫ్రీన్ మాట్లాడుతూ ఆడపిల్లలకు చదువు ఎంతో అవసరమన్నారు. ఏఎన్ఎం నాగదుర్గ కిశోర బాలికలతో యోగా చేయించారు. అనంతరం గ్రామంలో విద్యా ప్రాముఖ్యతపై ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆశా వర్కర్ ఏసమ్మ, అంగన్‌వాడీ ఆయా సాయమ్మ, జ్యోతి, కిశోర బాలికలు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మేరి, మహిళలు

ప్రమాదకరంగా పాలగూడెం వంతెన

దెందులూరు : ఏలూరు రూరల్ మండలం పాలగూడెం లాకుల వద్ద వంతెన ప్రమాదకరంగా మారింది. ఈ వంతెనపై నిత్యం ఐదు వేల మందికి పైగా ప్రయాణికులు ఏలూరు వైపు ఏలూరు నుంచి పాలగూడెం, కొవ్వలి, దోస పాడు, పోతునూరు, కేతవరం, గుండుగొలను గ్రామాలకు రాకపోకలు కొనసాగిస్తుంటారు. లాకులు వద్ద వంతెన కుడివైపు సగం పూర్తిగా విరిగిపోయి ఉంది. ఈ వంతెనపై ఏమాత్రం ఆదమరచినా కిందకి పడిపోవడం ఖాయంగా ఉంది. త్వరితగతిన వంతెనపై రక్షణ ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

రాజశేఖర్ మృతి తీరని లోటు



రాజశేఖర్ భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న జేపీ

ఏలూరు టౌన్: స్థానిక బీడీ కాలనీ కుమ్మరి రేవు ప్రాంతానికి చెందిన జోరింగుల రాజశేఖర్ గుండెపోటుతో మరణించారు. వైఎస్సార్ సీపీ ఏలూరు సమన్వయకర్త మామిళ్లపల్లి జయ ప్రకాష్ ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. రాజశేఖర్ కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు. రాజశేఖర్ మృతి ఆయన కుటుంబానికి తీరని లోటని అన్నారు. ఆయన మృతికి నాయకులు గుడిదేశి శ్రీనివాస్, మున్నుల జాన్ గురునాథ్, కిలాడి దుర్గారావు, రంగారావు, చొటపల్లి రాజు, వడ్డే నవీన్, జిజ్జువరపు హేమ చంటి సంతాపం తెలిపారు.

ఘనంగా తిరంగా యాత్ర

కొయ్యలగూడెం: మండలంలోని గవరవరంలో శుక్రవారం పలు రాజకీయ పార్టీల నాయకులు తిరంగా యాత్ర నిర్వహించారు. బీజేపీ శ్రేణులతో పాటు అనుబంధ విభాగాల నాయకులు, అధికార ప్రతిపక్ష పార్టీల నాయకులు భారతమాతకు జేజేలు పలుకుతూ ర్యాలీ నిర్వహించారు. జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు, బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఎస్ఆర్ఆర్ సుభద్రాదేవి ఆధ్వర్యంలో ఆపరేషన్ సిందూర్ అమరవీరులకు నివాళులర్పించారు.

నేడు పాస్టర్ ప్రవీణ్ పగడాల జ్ఞాపకార్థ సభ

దెందులూరు: సువార్తికుడు ప్రవీణ్ పగడాల జ్ఞాపకార్థ సభ శనివారం రాజమండ్రి కొంతమూరు ప్రకృతి వేదిక వద్ద సాయంత్రం నాలుగు గంటలకు నిర్వహించనున్నట్టు ఫారెస్ట్ కార్పొరేషన్ రాష్ట్ర మాజీ డైరెక్టర్ పల్లెం ప్రసాద్, జిల్లా పాస్టర్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు పాల్ ఆశీర్వాదం, ఉపాధ్యక్షుడు పాస్టర్ పీవీ రాజు, పాస్టర్ జీపీ అబ్రహం తెలిపారు. శుక్రవారం పాస్టర్స్ అసోసియేషన్ జిల్లా కార్యాలయంలో వారు మాట్లాడుతూ ఏలూరు జిల్లా నుంచి అధిక సంఖ్యలో క్రైస్తవులు పాల్గొని ప్రవీణ్ పగడాల కుటుంబానికి అండగా నిలవాలని కోరారు.



మాట్లాడుతున్న ఫాస్టర్ అసోసియేషన్ సభ్యులు